# సమ్ బంధాలు

సుబ్బారావు, సూర్యారావుల స్నేహం ఈ నాటిది కాదు. ఇద్దరూ ఒకే రోజు ఉద్యోగంలో చేరారు ఒకే సంస్థలో అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. వివిధ ఊళ్ళల్లో పనిచేసి చివరికి ఒకే ఆఫీసుకు బదిలీ అయి వచ్చారు – పదవీ విరమణ వయసులో

పదవీ విరమణ డబ్బులను జాగ్రత్తగా వాడుకోవాలని నిర్ణయించుకున్నారు. బ్యాంకులో వేస్తే డబ్బులు ఖర్చయిపోతాయని భయపడ్డారు. అందుకని ఎప్పటికయినా స్వంత యిల్లు ఉంటే మేలని ... వాళ్ళ ఊర్లో ఇండిపెండెంట్ హౌసులు కడుతూ ఉంటే ఆ స్కీములో చేరారు.

సాఫీగా పదవీవిరమణ జరిగిపోయింది. అనుకున్నట్లుగా ఓ నెల రోజుల్లో వారికి అందవలసిన పైసలు అన్నీ అందాయి వారనుకున్న ఇళ్ళకోసం బాకీ డబ్బులు కడితే ఇళ్ళు వారిపేర్ల మీద రిజిష్టరు చేయబడతాయి.

రిజిస్ట్రేషన్ మంచి రోజు చేయిద్దామని ఎదురు చూస్తూ వున్నారు ఇంతలో – ఒక రోజు ఉదయం సూర్యారావు సుబ్బారావు ఇంటికి వచ్చాడు.

" ఒరేయ్ సుబ్బారావు ! ఇల్లు కొనుక్కునే రాత నాకు లేదురా!"

" అదేంటిరా – బ్యాలెన్సు కడితే వాళ్ళు రిజిష్టరు చేసిస్తారు గదా !" సూర్యారావు మాటలకు సుబ్బారావు ఒకింత ఆశ్చర్య పోయి చెప్పాడు.

" దాదాపు పాతిక సంవత్సరాలుగా స్వంత ఇల్లు గురించి కలలు కన్నాను – కొంత డబ్బు సర్దుబాటుగాక – ఉద్యోగ రీత్యా ఊళ్ళు పట్టుకు తిరగడం – ఎక్కడ సెటిలు కావాలి? అన్న ఆలోచనలతో నాకల ఆలశ్యమవుతూ వచ్చింది. చివరికి తెగించి ఈ ఊళ్ళో స్వంత ఇల్లు ఏర్పాటు చేసుకుందామనుకున్నా – అదీ నీలాంటి మంచి మిత్రుడి పక్కన ఇల్లు కొనుక్కుందామనుకున్నా – కాని తానొకటి తలిస్తే – దేవుడొకటి తలుస్తాడని – " నిరాశగా అన్నాడు సూర్యారావు.

" అసలేం జరిగిందో చెప్పరా – మంచి ముహూర్తం కూడ వచ్చేనెలలో ఉంది.." సుబ్బారావు అనునయంగా అన్నాడు.

" ఏముందిరా ! నీకు తెలియనిదేముంది. నాకు ఇద్దరు పుత్ర రత్నాలు – ఒక పుత్రికా రత్నం ఉన్నారుగా ..." ఇంతలో అనసూయమ్మ గారు ప్లేటులో టిఫెను తీసుకురావడంతో ఆపాడు.

అనసూయమ్మ సుబ్బారావు భార్య, వంటలు దివ్యంగా చేస్తుంది. ఆమె అతనికి అన్ని

రకాలుగా చేదోడు వాదోడుగా ఉంటుంది.

వేడి వేడి పెసరట్టు ఉప్మా తింటుండే సరికి సుబ్బారావుకు ఆలోచనలు ఎక్కడికో పరుగెత్తాయి.

సూర్యారావు అదృష్టవంతుడు! అది ఈ నాటిమాటకాదు. తనకు తెలిసినప్పటినుండి అతన్ని తనతో పోల్చుకుని ఆమాట ఎప్పుడు అనుకుంటూ ఉంటాడు. ముఖ్యంగా అతనికి సంతానం ఉంది, తమకు లేదు.

సూర్యారావు పెద్ద కొడుకు ఇంజనీరు – ప్రభుత్వరంగ సంస్థలో పనిచేస్తున్నాడు – హైద్రాబాదులో. పెళ్ళయింది ఒక బాబు, ఒక పాప ! కోడలుత్తమురాలు.

రెండవ కొడుకు కంప్యూటరు డిప్లొమాలు తీసుకుని అందుకు సంబంధించిన ఇనిస్టిట్యూట్ స్వంతంగా పెట్టుకున్నాడు – విజయవాడలో. అతనికీ పెళ్ళయింది – ఇద్దరు కూతుళ్ళు కూడా.

మూడవ సంతానం సంధ్య గడుసుది... ఓ పట్టాన పెండ్లికొడుకులు నచ్చలేదు. ఎన్నో సంబంధాలు వెతకాల్సి వచ్చింది. చివరికి ఓ లెక్చరరును చేసుకుంది – తనూ చదువుకుంది కాబట్టి ఓ స్కూల్లో ఉబుసుపోకకు పన్జేస్తున్నది వైజాగ్‌లో. వారికి ఒకబ్బాయి.

ఏతావాతా సూర్యారావు కు దిగులు లేదు. ముగ్గురూ తమ దగ్గరకు రమ్మని ఆహ్వానిస్తూ ఉంటారు కాని సూర్యారావు భార్య రజనికి ఎందుకో యిష్టం ఉండదు. తమింట్లో తాముండాలని ఆమె కోరిక ! అందుకోసమే తనతో మాటు ఈ స్కీములో చేరి స్వంత ఇల్లు కల స్వంతం చేసుకోబోతున్నాడు సూర్యారావు. ఒక నెల దాటితే తామిద్దరం పక్కపక్కన ఉండచ్చు స్వంత యిండ్లలో.

“ఏం సుబ్బారావు – ఎక్కడికో వెళ్ళిపోయావు – పిలుస్తున్నా పలకడం లేదు.” అన్న మాటల్తో ఈ లోకంలోకి వచ్చి పడ్డాడు – సుబ్బారావు.

“ చెప్పు – నీ అదృష్టం గురించే ఆలోచిస్తున్నా !”

“ ఏమదృష్టమో ఏమో! ముగ్గురూ పీక్కుతింటున్నారు వాళ్ళ వాళ్ళ యిళ్ళకు రమ్మని. రిటైర్ అయి అక్కడేం చేస్తావు – వచ్చి మాతో ఉండమని ఒకటే పోరు. కాని మీ చెల్లెలు రజనికి స్వతంత్రంగా ఉండటం యిష్టం.” చెప్పాడు సూర్యారావు.

“ కాని ఎంత కాలం ఉండగలం అన్నయ్యగారు – రేపు కాలో చెయ్యో మెత్తబడితే ఎవరో ఒకరు మనకి తోడుండాలిగా !” అనసూయమ్మ కాఫీలు తెస్తూ చెప్పింది.

“ అదీ పాయింటే ! అట్లాగని ఎవరి దగ్గరుంటాం ? పెద్దోడి దగ్గరుందామంటే చిన్నాడికి కోపం ! చిన్నాడి దగ్గరుందామంటే పెద్దాడికి కోపం – ఇద్దర్నీ వదిలి అమ్మాయి దగ్గరుందామంటే ఇద్దరికీ కోపం – పోనీ వీళ్ళ దగ్గరుందామంటే అమ్మాయికి కోపం –

ఇలా వీళ్ళ కోపతాపాలతో మాకేం పాలు పోవడం లేదు. " సూర్యారావు చెప్పాడు.

" అందుకే గదరా ! ఇక్కడ ఇల్లు కొనుక్కుంటున్నది. వాళ్ళే వచ్చి పోతూ ఉంటారు నిన్ను చూడ్డానికి." సుబ్బారావు చెప్పాడు.

" ఈసంగతి వాళ్ళకు తెల్సి – ఎకాఎకిన వచ్చి వాలారు నిన్న – ఏదో పండక్కు వచ్చారు కదా అనుకుంటే విషయం అది కాదు – నీకు ఇల్లు యిక్కడ ఎందుకు? మేం లేమా ? ఒక వేళ అంతగా కొనాలనుకుంటే మా వూళ్ళో కొనుక్కో! ఇదీ వరస!" అంటూ వాళ్ళ పట్టుదలలు చెప్పుకొచ్చాడు సూర్యారావు.

వాళ్ల ముగ్గురికి ఈ ఊళ్ళో ఉండడం యిష్టంలేదు. అంతకు మునుపంటే ఉద్యోగం ఉంది కాబట్టి ఉండక తప్పిందికాదు. ఇప్పుడు పట్టణంకాని ఈ ఊళ్ళో ఎందుకుండాలి? ......... ఊరికే పదిలక్షలు పోసి యిక్కడ కొనుక్కునే బదులు వాళ్ళ ఊళ్ళో కొంటే సౌకర్యంగా ఉంటుంది – భవిష్యత్తులో రేట్లు బాగా పెరుగుతాయి. ఇలా ఎవరికి వారు తమ ఊళ్ళో ఇల్లు కొనుక్కోమని ఒకటే గోల!

" సుబ్బారావు – నాకేం చెయ్యాలో పాలు పోవడం లేదు. నువ్వొక సారి వచ్చి మా వాళ్ళతో మాట్లాడు." సూర్యారావు అర్థించాడు.

కుడితిలో పడ్డఎలుకలా యిరుక్కుపోయాడు.

" సూర్యం – ఇది కుటుంబ సమస్య కదా ! బయటి వాళ్ళు ఏం చేస్తార్రా?"

" అలా అనకు – నువ్వంటే మా వాళ్ళకు గౌరవం ఉంది ... ఇంక ఆపదలో సలహా యివ్వక పోతే స్నేహానికి అర్థం ఏముంది?"

సూర్యారావు బలవంతం మీద సుబ్బారావు ఆ సాయంత్రం మిత్రుడి యింటికి వచ్చాడు.

" చూడండి అంకుల్ ! మేం లేమా ? ఎవరూ దిక్కులేనట్లు ఈ ఊళ్ళో సెటిలై పోతారట డాడి!" పెద్ద కొడుకు అప్పారావు ఆవేశంగా చెప్పాడు.

" ఈయన్ని ఇలా ఒంటరిగా వదిలేస్తే లోకం మా మొహాన ఉమ్మెయ్యదా? చెప్పండి!" చిన్నకొడుకు ఆనందరావు చెప్పాడు.

" సరే మీ కంటే ఏ బాదరబందీలు లేవు – పిల్లా పీచు లేరు – మీ రీవూళ్ళో సెటిలయ్యారంటే ఒక అర్థం ఉంది – మా నాన్న కేమండి ముగ్గురం ఉన్నాం.... కోడళ్ళ దగ్గర ఉండటం యిష్టం లేక పోతే కూతుర్ని నే ఉన్నాగా – కంటికి రెప్పలా కాపాడుకుంటాను – మావూరు వచ్చెయ్య మనండి." కూతురు సంధ్య చాలా తేలిగ్గా చెప్పింది.

ఆమె ఎంత తేలిగ్గా అందో – ఆ మాటలు అంత బరువుగా సుబ్బారావును తాకాయి. పిల్లా – పీచు లేరు – నీకేం తెలుస్తాయి బాంధవ్యాల విలువ అన్నట్లుంది... అంత తొందరగా జీర్ణం చేసుకోలేక పోయాడు.

" అది కాదమ్మా ! పుట్టి పెరిగిన ఊరు - తన కెరియరు ఇక్కడ ప్రారంభించి - యిక్కడే రిటైర్ అయ్యాడు. సెంటిమెంట్లు ఉంటాయిగా - ఈ వయసులో వేరే ఊరు కొచ్చి ఆ గాలి - ఆ నీళ్ళు పడక అవస్తపడాలి!" వెనకేసుకొచ్చాడు సూర్యారావును సుబ్బారావు.

" రేప్పొద్దున ఏమన్నా జరిగితే ఎవరు ఆదుకుంటారు? దగ్గరా దాపా ! మాలో ఎవరు రావాలన్నా పదిగంటలు ప్రయాణం - మిమ్మల్ని నమ్మి వెళదామన్నా మీరే రాలి పోయే పండ్లు - రేపు నాన్నకు కాని అమ్మకు కాని హార్ట్ఎటాక్ వచ్చినా - పెరాలసిస్ వచ్చినా వచ్చి ఎవరుంటారు? ఏదో మా వూళ్ళో ఉంటే మాకు పెద్దగా యిబ్బంది ఉండదు." సంధ్య గబగబ అనేసింది.

" అంటే నువ్వనేదేంటే - మాకు రోగాలు రావాలనా!" తల్లి ముక్కు చీదింది.

" అని కాదు - కీడెంచి మేలెంచాలి గదా !" పెద్ద కొడుకు సమర్థన !

" కాలం ఒక్కలా ఉండదు - ఎంతమంది ఆరోగ్యంగా వున్నా క్షణాల్లో పోవడంలా!" చిన్నకొడుకు ఆవేదన.

" అది రా సుబ్బారావు - అస్సలు విషయం ఏమంటే వీళ్ళకెవరికీ నేను ఈ ఊళ్ళో యిల్లు కొనడం - ఉండడం యిష్టం లేదు." సూర్యారావు చెప్పాడు.

" ఇప్పుడు కాదంటే ఎలా? దాదాపు సగం పైగా డబ్బులిచ్చేశావు. ఇంకో ఐదు పెడితే నీ పేరు మీద రిజిష్టరు అవుతుంది. వచ్చే నెల్లో ఇల్లు మన చేతికిస్తానన్నాడు గదా!" సుబ్బారావు అన్నాడు.

" ఒరే కొన్నాళ్ళున్నా మాకు స్వంత ఇల్లు యోగం కలగనీయండిరా ! ఇన్నాళ్ళు అద్దెకొంపల్లో ఉండి నానా బాధలు పడ్డాం !" రజని బాధగా అంది.

" స్వంత ఇల్లు వద్దని మేము అనడం లేదు - ఇక్కడెందుకంటున్నాము?" ముగ్గురు అన్నారు.

" అలా అనుకున్నా - మనం అందరం ఒకే చోట ఉండలేం గదా? ఏ ఊళ్ళో కట్టుకోవాలి? హైద్రాబాదా - విజయవాడా - వైజాగా?" సూర్యారావు అడిగాడు.

దానిపైన ఓ గంట చర్చ జరిగింది. ఎవరికి వారు మా వూరే బాగుందని సమర్థించుకున్నారు.

వాళ్ళ వాదనలు ఎటూ తేలక పోయేసరికి సుబ్బారావు జోక్యం చేసుకున్నాడు.

" ప్లీజ్ ! నామాట వింటానంటే ఓ సలహా ! మీరందరూ ఉద్యోగస్తులే! ఎలాగు స్వంత యింటికోసం ప్రయత్నిస్తారు. కట్టించుకుంటారు. ఇంక మీనాన్నగారు మళ్ళీ ప్రత్యేకంగా ఎందుకు కట్టుకోవాలి ! మీ ముగ్గురు నాన్నగారి కోసం అమ్మగారి కోసం ఓ

ప్రత్యేక గది కట్టించండి.. సపరేట్ బెడ్ రూం - వారికి వసతిగా ఉండేలాగా - ఎప్పుడంటే మీరు స్వంత ఇల్లు కట్టించుకునేటప్పుడు. అప్పుడు ఆయన మీతో ఉంటారు - ఈ లోగా ఇక్కడ యిల్లు ఆయన్ని రిజిష్టరు చేసుకోనివ్వండి ... మీ ఇళ్ళు పూర్తయిన తర్వాత అవసరమైతే ఈ ఇల్లు అమ్మి మీ దగ్గరికి వచ్చేస్తారు ఇద్దరూ!"

దాని మీద మళ్లీ ఓ గంట తర్జన భర్జనలు జరిగాయి.

సంధ్య చెప్పింది " నాన్నగారు వట్టి అమాయకులు - ఆయనకు వ్యాపార తెలివితేటలు లేవు - ఇల్లు కట్టుకుని అమ్ముకోవాలంటే బాగా నష్టపోతారు. పైగా ఒకసారి కట్టుకున్న ఇల్లు అమ్మ బుద్ధికాదు."

" డాడి మమ్మీలకు అస్సలు ఇల్లు ఎందుకుట?" పెద్దకొడుకు .

" కొడుకులం మేం ఉన్నాంగా - విజయవాడ వచ్చేస్తే బోల్డు కాలక్షేపం - మాకు పెద్ద దిక్కుగా ఉంటారు."

సుబ్బారావు కాసేపుండి వచ్చేశాడు, అంతర్జాతీయ సమస్యలు అంత సులభంగా తేలవని.

వారం రోజుల తర్వాత సూర్యారావు వచ్చాడు మొహం వేలాడేసుకుని....

" ఏరా అలా ఉన్నావు!" సుబ్బారావు అడిగాడు.

మాట్లాడలేదు అనసూయమ్మ చేతి కాఫీ తాగింతర్వాత గొంతు సరిచేసుకున్నాడు.

" ఒరే సుబ్బీ! మా యిల్లు అమ్మి పెట్టరా?"

" అయితే ఇల్లు వద్దనుకున్నావా?" భారంగా అడిగాడు.

" నేను అనుకోలేదు - అందరు కల్సి .... అస్సలు పూర్తికాని ఇల్లు అమ్ముడు పోతుందంటావా? మన డబ్బులు మనకి వెనక్కివస్తాయా?"

" అన్నయ్య గారు ! ఒక్కసారి ఆలోచించుకోండి. అడ్డాలనాడు బిడ్డలు కాని గడ్డాలనాడు కాదు. కొడుకులు - కూతురు మన కడుపున పుట్టినా - కోడళ్ళు అల్లుడు మన వాళ్ళు కారు కదా ! ఇప్పుడున్న ప్రేమలు తర్వాత తర్వాత ఉంటాయో ఉండవో!" అనసూయమ్మ అనుమానపడింది.

" ఎందుకలా అనుకోవాలి! మీ కూ ఎవరైనా ఉంటే అర్థమయి ఉండేది నా బాధ! పేగు బంధం !" సూర్యారావు అన్నాడు.

అనసూయమ్మ లోపలికి వెళ్ళి పోయింది మొహం చాటేసి.

సుబ్బారావు కూడ తల వంచేసుకున్నాడు.

తమకు పిల్లలు లేరనా తండ్రీ కొడుకుల అనుబంధాన్ని - తల్లీ కూతుళ్ళ అనుబంధాన్నీ అనుమానిస్తున్నది? చులకనగా చూస్తున్నది?

" పొమ్మేరా! నువ్వు వాళ్ళెంబడి వెళ్ళితే వెళ్ళు - కాని ఇల్లేం చేసిందిరా ! ఇంతవరకు వచ్చింతర్వాత రిజిష్టరు చేసుకోకుండా ఎందుకుండాలి! నీది అంటూ ఒక ఇల్లు ఉంటుంది. అద్దెకిచ్చి వెళ్ళు - అవసరమైనప్పుడు రావచ్చు ." సుబ్బారావు బరువుగా అన్నాడు - కాసేపటికి.

" అవసరం ? ఆ అవసరం ఎందుకు వస్తుందిరా ! మా పెద్దోడు చిన్నోడు - సంధ్య వాళ్ళల్లో వాళ్ళుతన్నుకు ఛస్తున్నారు మేం వాళ్ళింటికే రావాలని ! మా ప్రేమలో కల్తీ లేదు - వాళ్ల దాంట్లో మటుకు ఎందుకుంటుంది? ఎవరో బోడిగాడు అద్దెకుండటానికి నేనెందుకు పది లక్షలు పెట్టాలి! యాభై పైసల వడ్డీ కూడ గిట్టు బాటు కాదు యింటి పైన " చెప్పాడు సూర్యారావు.

" ఒరే సూర్యం ! మనకు పెన్షన్ కూడ లేదు వచ్చిన పియఫ్ వగైరా డబ్బుల్ని భద్రం చేసుకోవాలి. బ్యాంకులో వేసుకుంటే అందరూ అయినవాళ్ళే దోచుకుంటారు. అదే యిల్లు రూపంలో ఉందనుకో - అంత సులభంగా దోచుకోరు. ఇంటి మీద వచ్చే అద్దె మనం పెన్షన్ క్రింద భావించవచ్చు ! దాంతో జీవనం కొనసాగించవచ్చు." సుబ్బారావు చెప్పాడు.

" మిత్రమా ! సుబ్బారావు ! నీకంటూ ఎవరూ లేరు కాబట్టి అలా ఆలోచిస్తున్నావు. నాకా సమస్య లేదు. పెన్షన్ లేక పోయినా టెన్షన్ లేకుండా నే బ్రతగ్గలను. నాకు ముగ్గురు రత్నాలున్నారు." సూర్యారావు గర్వంగా అన్నాడు.

అంతే ! ఓ వారం తర్వాత సూర్యారావు వెళ్ళి పోయాడు. పోతూ పోతూ ఇల్లు అమ్మకానికి పెట్టాడు.

ఎవరో ఎందుకు కొనాలి - అని బాధపడి - తమ స్నేహానికి గుర్తుగా సుబ్బారావు సూర్యారావుకు డబ్బిచ్చి - ఆ యిల్లు తానే రిజి   ష్టరు చేయించుకున్నాడు.

దాంతో దాదాపు సుబ్బారావు కు వచ్చిన డబ్బులు అయిపోయాయి. కాక పోతే ఒక యింట్లో అంటే మొదట కొనుక్కున్న ఇంట్లో పెద్ద పోర్షన్‌లో ఉండి చిన్న పోర్షను అద్దె కిచ్చుకున్నారు - సూర్యారావు ఇల్లు పూర్తిగా ఒక పెద్ద కుటుంబానికి అద్దెకిచ్చారు.

ఫర్వాలేదు, ఇల్లు గడుస్తుంది!

కాలచక్రం గిర్రున తిరుగుతూ ఉంది.

మహాశివరాత్రి పర్వదినాన సుబ్బారావు - అనసూయమ్మను తీసుకుని శ్రీశైల మల్లన్న దర్శనం చేసుకుని తిరిగి వస్తున్నాడు. ఎంతో మంది బిచ్చగాళ్ళు గుడి మెట్ల దగ్గర కూర్చొని అడుక్కుంటున్నారు వాళ్ళ కోసమే సుబ్బారావు రూపాయి బిళ్ళలు తెచ్చుకున్నాడు. ఒక్కొక్కటి వేస్తూ వస్తున్నాడు. ఒక ముష్టి వాడికి వేయగానే అతను మొహాన్ని తువ్వాలులో దాచుకున్నాడు... సుబ్బారావు ముందుకు నడిచాడు.

" ఏవండీ ! అతనిలో మన అన్నయ్య పోలికలున్నాయండి.." అనసూయమ్మ చెప్పింది.

" ఏ అన్నయ్య ?"

" అదేనండి మీ(ఫ్రండు సూర్యం – పదేళ్ళుగా ఒక ఉత్తరం – పత్తరం లేదు .. అతనిలా ఉన్నాడండి."

" మనిషిని పోలిన మనిషి ఉండొచ్చు – ఒకే పోలికతో లోకంలో ఏడు మంది ఉంటారట. –నేను పెద్దగా గమనించలేదు."

" ఏమో కాని – అతను మటుకు మిమ్మల్ని చూడగానే మొహం చాటేశాడు." అనసూయమ్మ చెప్పింది.

కుతూహలం ఆపుకోలేక వెనక్కితిరిగి వచ్చాడు సుబ్బారావు. ఓ మాసి పోయిన గడ్డం – చిరుగులు – అతుకులు పడ్డ దుస్తులు – లోతుకు పోయిన కళ్ళు ... ఎక్కడో చూసినట్లుంది. కొంచెం పోలికలున్నాయి.

ఒక రాయి విసురుదామనిపించి " ఒరే! సూర్యం !" గట్టిగా కేక పెట్టాడు – అందరూ సుబ్బారావు వంక చూశారు – ఆ బిచ్చగాడు మటుకు తల దించుకున్నాడు.

సుబ్బారావుకు అనుమానం బలపడింది. దగ్గర కొచ్చి అతని తల పైకెత్తాడు . " ఒరే సూర్యం ! ఏంటిరా ఈ పని?" గద్గదికంగా అడిగాడు

సదరు సూర్యారావు వెంటనే లేచి నిల్చొని ఏడ్చాడు. ఏదో చెప్పబోయాడు అందరూ యిటే చూస్తున్నారు.

" తరువాత – ముందు మన గదికి పోదాం పద .." సూర్యంను చేయి పట్టుకుని నడిపించాడు.

తోటి బిచ్చగాళ్ళు – సాటి భక్తులు వింతగా చూడసాగారు. అవన్నీ పట్టించుకోలేదు సుబ్బారావు.

కాసేపటికి స(త్రం కొచ్చి పడ్డారు ముగ్గురు – వీరిద్దరు ఒక రకమైన షాక్‌లో ఉన్నారు. కలో – నిజమో తేల్చుకోలేని పరిస్థితి.

" సూర్యం – ఏం జరిగిందో చెప్పరా?"

" ముందు అన్నం కావాలి – అన్నం తిని మూడు రోజులయింది." సూర్యం చెప్పాడు.

హోటల్ కు తీసుకు పోయి భోజనం పెట్టించాడు.

తిరిగి రూము కొచ్చి కూర్చున్నారు.

" అన్నయ్యగారు ... మా మరదలు ఎక్కడుంది?" అనసూయమ్మ.

సూర్యం చేయి ఎత్తి పైకి చూపించాడు.

భోరున విలపించాడు.

అతని దగ్గర్నుంచి జరిగిన విషయాలు రాబట్టటానికి చాలా సమయం పట్టింది. జరిగింది సంగ్రహంగా అర్థమయిందేమంటే ...

ముగ్గురు పిల్లలు మొదట్లో బాగా చూసుకున్నారు. ఎందుకంటే వారందరికి వీరి అవసరం పడింది. వాళ్ళకు చిన్న చిన్న పిల్లలు ఉండటం వలన - వారు పెద్దవారు కావడానికి వీరిపైన ఆధార పడ్డారు.

కొంతకాలానికి ముగ్గురూ ఇళ్ళు కట్టుకున్నారు - పోటీలు పడి.

ఎవరికి తోచినంత వారు సూర్యం దగ్గర డబ్బులు తీసుకున్నారు.

సంధ్య అయితే ఒకసారి అల్లుడు ఉద్యోగం పోయేటట్లుందని రెండు లక్షలు తీసుకుంది. మళ్ళీ యిస్తానని - తరువాత మర్చిపోయింది. అది గాక అల్లుడు ఇల్లు కట్టుకున్నప్పుడు నాలుగు లక్షలు తీసుకుంది.

అప్పారావు - ఆనందరావులు చెరో ఐదు లక్షలు గుంజుకున్నారు మొదట్లో బాగా చూసినా రాను రాను కోడళ్ళ చిరాకులు - పరాకులు ఎక్కువై పోయాయి. కొన్నాళ్ళు ఇద్దరూ విడివిడిగా ఉండాల్సి వచ్చేది. కొన్నాళ్ళు కల్సి కూతురు ఇంట్లో ఉండాల్సి వచ్చేది.

ఎవరింట్లో ఉన్నా కడుపునిండా తినడానికి కాని - కంటినిండానిద్ర పోవడానికి కాని ఉండేది కాదు స్వాతంత్ర్యం

నాన్నా ఈ పని చెయ్యి -

అమ్మా ఈ పని చెయ్యి -

మీరేం ఉద్యోగాలు చేస్తున్నారా - ఊళ్ళేలుతున్నారా - ఈ పిల్లల్ని కాస్త చూడండి..

మీరేమన్నా కొత్త పెళ్ళికూతురు పెండ్లికొడుకా - కల్సి బ్రతకడానికి - అవసరం కొద్దీ ఒకళ్ళు మా యింట్లో - యింకొకళ్ళు యింకొకళ్ళ యింట్లో ఉండండి - ఉరేడి తీరాలి!

ఈ కాలంలో ఇద్దర్ని పోషించాలంటే మా వల్లకాదు -

ఇలా రాచి రంపాన పెట్టేవారు పుత్రరత్నాలు - పుత్రికా రత్నం - మరియు వారి సంతానాలు.

మౌనంగా భరించే వారు - అయిన వాళ్ళు కాబట్టి - ఎక్కడా బయటకి చెప్పుకోలేక.

వారి ప్రేమ వెనుక నున్న అవసరాల అంతర్యాలు - ఆర్థిక సంబంధాలు తెల్సుకునేసరికి చేతిలో చిల్లి గవ్వ లేకుండా పోయింది.

సరిగ్గా అదే సమయంలో రజనికి జబ్బు చేసింది...యూరినరీ ఇన్‌ఫెక్షన్ - కిడ్నీలు చెడి పోయాయి. ఆపరేషనుకు లక్షన్నర ఖర్చు అవుతుంది...

ఆమెను మంచి ఆసుపత్రిలో కూడ చూపించ లేక పోయాడు.

వాళ్ళ ముగ్గరి కాళ్ల వేళ్ళ పడ్డాడు అమ్మకు ఆపరేషను చేయించండిరా - ఆమెను బ్రతికించండిరా అని, చిన్న పిల్లవాడిలా ఏడ్చాడు సూర్యం

అంత డబ్బు ఖర్చు పెట్టడానికి ఎవరికీ మనసు రాలేదు - 'ఇప్పుడు ఆమె బ్రతికి ఎవరిని ఉద్ధరించాలి?' అని కూతురు సంధ్య అడిగింది.

' ఆపరేషను అయినా బ్రతుకుతుందని గ్యారంటీ ఏంటనీ" పెద్ద కోడలు అడిగితే - 'చచ్చే వాళ్ళు చావకుండా మా అందర్నీ చంపుతున్నారని' చిన్నకోడలు వాపోయింది.

ఇవన్నీ చెవుల పడేసరికి ... రజని గుండె బద్దలయింది.

దానికి తోడు ప్రభుత్వ ఆసుపత్రిలోని ట్రీట్ మెంట్ - అన్నీ కలిసి ఆమె చావును త్వరితం చేశాడు.

నిస్సహాయుడిగా ఆమె మంచం దగ్గర కూర్చుని ఏడవడం తప్పించి సూర్యారావు ఏమీ చెయ్యలేక పోయాడు...

తెగించి 'ఒరే ! మీ ఇళ్ళ కోసం యిచ్చిన డబ్బుల్లో కనీసం నాకు సగం యివ్వండిరా - మీ అమ్మను కాకపోయినా - నా పెళ్ళాంను బ్రతికించుకుంటాను'. అని అడిగాడు.

' ఇస్తే ఏం చేస్తావు ' అని ఒకరు - ' ఇవ్వాలంటే మా దగ్గరవుండొద్దా' అని ఒకరు - 'కూతురు దగ్గర డబ్బులాశిస్తారా' అని అల్లుడు యిలా మనో వ్యధ కలిగించిన వాళ్ళే తప్పించి యిచ్చి న వాళ్ళు లేరు.

ఈ బాధలన్నీ తట్టుకో లేక - తన సంతానం చూపిన ప్రేమను భరించలేక పిచ్చితల్లి రజని ఓ రాత్రి కన్ను మూసింది.

వాళ్ళు లోకానికి భయపడి ఆమె అంత్యక్రియలు ఘనంగా జరిపించారు కాని ... సూర్యంకు లోకం శూన్యమై పోయింది. పిచ్చివాడై పోయాడు. కాలం గడచినా సూర్యం మనసులో గాయం మానలేదు. నా భార్య చని పోవడానికి కారణం నువ్వంటే నువ్వే అని కొడుకులతో, కోడళ్ళతో, కూతురితో అల్లుడితో తగులాడేవాడు. చివరికి వాళ్ళు తన్నడానికి కూడ సిద్ధమయ్యారు తిండి కూడ పెట్టకుండా మాడ్చేవాళ్లు...

ఇలా కొంత కాలం గడచింతర్వాత

తమ ఊరినుండి కొందరు భక్తులు శ్రీశైలం వస్తూ ఉంటే వారి బస్సులో ఎక్కి శ్రీశైలం చేరుకున్నాడు...

తిరిగి తన సంతానం దగ్గరికి పోబుద్ధికాలేదు

ఎవరికోసం పోవాలి? ఎందుకోసం పోవాలి? ఎముందక్కడ?

ఆకలి తీరాలి కాబట్టి ఊంచ వృత్తి ఎన్నుకున్నాడు - ఒకప్పటి వందల మందికి

అధికారి అయిన సూర్యారావు.

గతం చెప్పి చెప్పి విలపించాడు సూర్యారావు.

" అన్నయ్యగారు ఇన్ని కష్టాలు పడ్డారు - మరి మేము ఎప్పుడు గుర్తుకు రాలేదా ఒక్క ఉత్తరం ముక్క కూడ రాయలేదు." అనసూయమ్మ అడిగింది.

" ఒరే కనీసం నన్ను అడిగినా చెల్లమ్మకు ట్రీట్ మెంట్ యిప్పించే వాడ్ని కదురా? ఎందుకడగలేదు?" సుబ్బారావు బాధపడ్డాడు.

" ఏమని అడగను - కడుపున పుట్టిన వాళ్ళకే కరుణ లేనప్పుడు పరాయి వాళ్ళను ఏమని అడగను? నిజం చెప్పాలంటే మా కొడుకుల్ని - కోడళ్ళనూ - కూతుర్ని - అల్లుడ్ని - వాళ్ళ బంధువులను చూసింతర్వాత నాకు మానవత్వం మీద నమ్మకం పోయింది. మార్క్సు గుర్తుకొచ్చాడు. అన్ని బందాలు ఆర్థిక బంధాలే అనిపించాయి. నువ్వు మటుకు మహా అయితే ఒక రోజు పెడతావు - తర్వాత - " సూర్యారావు ఏడుస్తూ చెప్పాడు.

" నిజమేరా ! నువ్వున్న పరిస్థితుల్లో స్నేహానికి విలువ ఉంటుందని అనుకోవడం పొరపాటే! కాని అందరూ అలా ఉండరు కదురా?"

" మమ్మల్ని కూడ మీ వాళ్ళతో పాటు లెక్క వేశారు !" అనసూయమ్మ.

" సూర్యం ! ఒకప్పుడు నువ్వు చాలా అదృష్టవంతుడివి అనుకునే వాడ్నిరా - దేనికో తెల్సా? నీకు పిల్లలున్నారని - భవిష్యత్తులో నువ్వు వారి దగ్గర చీకు చింతా లేకుండా జీవితాన్ని వెళ్ళదీస్తావని కొంచెం అసూయపడ్డాను. భగవంతుడు మాకు ఆ అదృష్టాన్ని యివ్వలేదని బాధపడ్డాను. - కాని నేడు... " సుబ్బారావు బాధతో కళ్ళు మూసుకున్నాడు.

" కాదురా సుబ్బారావు ! నిజంగా నువ్వే అదృష్టవంతుడివి ! ఆ మాటకొస్తే ఈ కాలంలో పిల్లలు లేని వాళ్ళు అదృష్టవంతులురా ! కన్న దగ్గర్నుంచి వాళ్ళను పెంచి - పెద్ద చేసి - చదివించి - ఉద్యోగం వేయించి - పెళ్ళి చేసి - వాళ్ళ పిల్లల్ని సాకి కష్టపడాలా - చివరికి వాళ్ళు మనకు పెట్టే కిరీటం ఏముందిరా? అంతా భ్రమ! పిల్లా పీచు లేక పోతే ఈ బాధలుండవు కదురా? లేక పోతే లేరని ఒకటే బాధ! దేవుడ్ని తలుచుకుంటూ బ్రతకాలి!"

" అన్నయ్య గారు - మీరు కూడ మాతో రండి ! మిమ్మల్ని మాకుటుంబ సభ్యులుగానే భావిస్తున్నాం... మీ దయవలన మేం కొన్న మీ యిల్లు మాకు పది కాలాల పాటు అన్నం పెడుతుంది కొడుకులు లేరన్న దిగులు ఆ యిల్లు మాకు తీరుస్తున్నది." అనసూయమ్మ చెప్పింది.

" ఎందుకమ్మా ! మన మధ్య ఏ సంబంధం ఉందని రావాలి! పేగు తెంచుకుని పుట్టిన వాళ్ళే ఛీ కొట్టారు. మీరు మటుకు ఎంత కాలం చూస్తారు? మీకు బరువు కదా!

మళ్ళీమీరు ఈసడించు కున్నపుడు నేనెక్కడి పోవాలి... ఇక్కడ ఈ మల్లన్న కొండల్లో ప్రశాంతంగా ముష్టి అడుక్కుంటున్నాను. నా అదృష్టం కొద్దీ ఎవరూ నన్ను గుర్తు పట్టలేదు ఇన్నాళ్ళు – ఇప్పుడు మీరు చూసి పలకరించారు." సూర్యారావు ఏడ్చాడు.

" ఒరే సూర్యం ! ఒకప్పుడు నువ్వు ఒక్క ఫోన్ చేస్తే ఎంతమంది భయపడేవాళ్ళురా నీ ఇంటర్వ్యూ కోసం ఎంతమంది బయట కాపుకాచే వాళ్ళురా ఎంత మందికి ఉద్యోగాల్లో సహాయం చేశావు – నీ మూలంగా ఎంతమందికి ఉద్యోగాలొచ్చాయి – అటువంటిది కడుపు నిండా తిండి లేక ... ఇలా అడుక్కోవడం – " సుబ్బారావు గొంతు పూడి పోయింది.

" అన్నయ్యగారు! మీరు చాలా అదృష్టవంతులని మేము నిన్నటి దాకా అనుకుంటూ ఉండేవాళ్ళం – మీకు మల్లే మాకడుపున ఒక్క నలుసు పుట్టినా వృద్ధాప్యంలో మాకింత ఒంటరి తనం – ఇంత ఆందోళన ఉండేవి కావనుకున్నాము. కాని అది నిజం కాదని తెల్సింది..." అనసూయమ్మ కూడ ఏడ్చింది.

" అంతా మాయరా ! పిల్లలు పుట్టారని సంతోషంతో ఏడ్చాం! వాళ్ళు పెరిగి పెద్దయి – మనల్ని చూడక ఇప్పుడు నిజంగా ఏడిపిస్తున్నారా – మా డబ్బులు – ఒంట్లో శక్తి మా కాలం అంతా దోచుకున్నారు. మా దగ్గర దోచుకోవడానికి ఏమీ మిగల లేదు – ఆఖరికి నా రజని కూడ .. వాళ్ళ నిర్లక్ష్యానికి – బలై పోయింది..." సూర్యారావుకు దుః ఖం ముంచుకొచ్చింది.

" సూర్యం ! గతంగతః ! కనీసం ఇప్పటినుంచన్నా మనం కల్సి ఉందాం – నువ్వు కూడ మాతో వచ్చెయ్యి ." సుబ్బారావు చెప్పాడు.

" ఒరే ! ఇప్పుడు నా దగ్గర పైసా ధనం లేదురా ! బ్రతుకు బండికి ఇంధనం – ధనమే కదురా ! మళ్ళీ రెండు రోజులు పోయింతర్వాత నన్ను చులకనగా చూస్తారేమో! ఎందుకులేరా – మీ స్నేహం ఒక తీపి కలగా మిగిలి పోనీ !" సూర్యారావు భయపడుతూ చెప్పాడు.

" ఎందుకలా భయపడుతున్నారు అన్నయ్య గారు!" అనసూయమ్మ అడిగింది.

" మీరు నాలాగా పండుటాకులే ! ఎప్పుడు రాలి పోతామో తెలీదు... పైగా మన మధ్య ఏం సంబంధం ఉందని నాకు సేవలు చేస్తారు – నా మీద ఖర్చు పెడతారు." సూర్యారావు అనుమాన పడ్డాడు.

"సూర్యం – ఈ గ్లోబలైజేషన్ కాదు గాని .... మానవసంబంధాలు విచ్ఛిన్నమవుతున్నాయి. నైతిక విలువలు దిగజారి పోతున్నాయి. నాగరకత పెరగడంతో .... విజ్ఞానం అభివృద్ధి చెందడంతో ... దేశాలకు మధ్య ఉన్నదూరాలు తరిగి పోయాయి. ప్రజల మధ్య రాకపోకలు పెరిగిపోయాయి. అంతకు ముందు 'వెస్టు ఈజ్ వెస్టు ఈస్టు

ఈజ్ ఈస్టు' అనుకునే వాళ్ళు. మనది గొప్ప సంస్కృతి అనుకునే వాళ్ళు – కాని ... మన వాళ్లు వెస్టులోని మంచిని గ్రహించలేక పోయారు కాని – పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు – వారి బాహ్యా సంస్కృతిని – భోగలాలసత్వాన్ని అనుకరిస్తున్నారు. అంతకు ముందు జెనరేషన్‌గ్యాప్ – కల్చరు గ్యాప్ అంటూ ఉండేవాళ్ళు... ఇరవయ్యేళ్ళకు వస్తుంది జనరేషన్ గ్యాప్ అనుకునేవాళ్ళం కాని – ఈ టీవీ ఛానళ్ళ పుణ్యమాని ఐదేళ్ళకు కూడ వచ్చేస్తున్నది." సుబ్బారావు ఆవేదనతో చెప్పాడు.

" ఒకప్పటి మన ఉమ్మడి కుటుంబాల వలన – ఎవరు పోయినా – ఎవరున్నా – ఎవరూ అనాథల్లాగా బ్రతికే వాళ్ళు కాదు. కలిసి మెలసి ఉండి– ఉన్నది అందరూ పంచుకుతినే వాళ్ళు – ఇప్పుడు – కుటుంబం అంటే మొగుడు పెళ్ళాం – మహా అయితే పిల్లలు పెద్ద వాళ్ళయ్యేదాకా వీళ్ళతో కల్సి ఉంటారు – తరువాత ఎవరి దారి వారిది... సుఖం అన్నది కేవలం డబ్బులోనే ఉందని భ్రమపడి పోతున్నాడు నేటి మనిషి. అనుబంధాల్లో – బాధ్యతల్లో – డబ్బు కంటే ఎక్కువ సుఖముందని తెల్సుకోలేక పోతున్నాడు. మనిషిని మనిషి ప్రేమిస్తే వచ్చే ఆనందం డబ్బు యివ్వలేదని గుర్తించలేక పోతున్నాడు." అనసూయమ్మ జీవిత సారాన్ని చెప్పింది.

" సారీరా సుబ్బా ! మీరు నన్ను చాలా సార్లు హెచ్చరించారు – అడ్డాలనాడు బిడ్డలు కాని గడ్డాలనాడు బిడ్డలు కాదని ... కాని నేను మూర్ఖుడ్ని – మీకు పిల్లలు లేరని – నాకున్నారన్న ఈర్ష్యతో – అలా అంటున్నారని అనుకునేవాడ్ని ! ఎక్కడో అమెరికాలాంటి దేశాల్లో తల్లి దండ్రుల్ని పిల్లలు సరిగా చూడరని అనుకునే వాడ్ని – అది మన భారతదేశంలో కాదని – అందునా మనలాంటి గొప్ప సంస్కృతి – ప్రేమ ఉన్న కుటుంబాల్లో తల్లిదండ్రుల్ని పిల్లలు నిర్లక్ష్యం చేయరనుకునేవాడ్ని – పైగా నా రక్తం పంచుకుని పుట్టిన నా బిడ్డలు అలా మారిపోతారని ఏనాడు నేను ఊహించలేక పోయాను. పైగా వాళ్ళకు నేనేమీ తక్కువ చేయలేదు – అన్నీ ఎక్కువే చేశాను కూడా ––నా పిల్లల్ని చూసి నేను గర్వపడేవాడి! అందుకే భగవంతుడు నాకీ శిక్ష విధించాడు." సూర్యారావు మళ్ళీ రోదించాడు – తన దుస్థితి తలచుకుని.

" నేనేమైపోతే మీకెందుకురా ! నాకు మీకు మధ్య ఏం సంబంధం ఉందనిరా నన్ను చూస్తానంటారు?"

" సూర్యం ! మనిషి మనిషికి మధ్య ఉన్న సంబంధం ఒక అనుబంధంగా మారాలి! మనసు పొరల్లో ఒకరంటే ఒకరికి గౌరవం ఉండాలి... కాని నేటి సమాజంలో సంబంధాలు కాస్తా సమ్ (SUM) బంధాలు గా మారి పోతున్నాయి – నీ వలన నాకేం లాభం అని ఆలోచించే వాళ్ళే పెరిగి పోతున్నారు.. అలా కాకుండా సంబంధాన్ని సం (SOME)

బంధంగా చూస్తే .. అభిమానం పెరుగుతుంది. కాని అడిగావు కాబట్టి చెబుతున్నా - నువ్వు నాకు సరసమైన ధరకు అమ్మిన ఇల్లు నాకు కొడుకులాగా తిండి పెడుతున్నది. . కనీసం ఆవిశ్వాసంతో నన్నా నీకు అండగా నిలబడాలి గదురా నేను, కనీసం మన మధ్య స్నేహం లేదనుకున్నా." సుబ్బారావు బాధగా చెప్పాడు.

" ఈ లోకం ఎక్కడికి పోతున్నది?. అన్ని బంధాలు సమ్ బందాలుగా మారి పోతున్నాయి - నేను పడ్డ బాధే రేపు నా కొడుకులు - కూతురు అనుభవిస్తారు - అప్పుడు వాళ్ళకు బుద్ధి వస్తుంది. కాని అప్పటికి వాళ్ళు ఎంత నష్ట పోయారో వాళ్ళకు తెలుస్తుందా? నష్టపోయిందాన్ని వెనక్కి తెచ్చుకోగలరా? " సూర్యారావు బాధగా చెప్పాడు.

" ఇప్పుడంతా ప్రస్తుతంలో బ్రతికేస్తున్నారు - వాళ్ళకు గతం అక్కరలేదు భవిష్యత్తు అక్కరలేదు. నేడు స్వర్గం - నిన్న నరకం - భవిష్యత్తు ఉందో లేదో - ఈ రోజే అనుభవించు - ఇది వారి ఆలోచన అన్నయ్యగారు - మాకు పిల్లలు లేక పోయినా మా వాళ్ళందరకు పిల్లలున్నారు. వాళ్ళని చూసి - మేము తెల్సుకున్న సత్యాలు - " అనసూయమ్మ చెప్పింది.

సూర్యారావు చెంపలు వేసుకున్నాడు.

" నాకంటే ముందుగా - నా కంటే ఎక్కువగా మీరు లోకం చదువుకున్నారు. నేనే మిమ్మల్ని అర్థం చేసుకోలేక పోయాను. నన్ను క్షమించండిరా !"

" భలేవాడివి ! మన మధ్య క్షమాపణ లేంటి .... మనసులు విప్పి మాట్లాడుకుంటే అదే చాలు !" సుబ్బారావు చెప్పాడు సూర్యారావును అనునయిస్తూ,

ఆ తర్వాత ----

ఆ ముగ్గురు తిరుగు ప్రయాణం కట్టారు. వారి మధ్య ఉన్న సంబంధం అనిర్వచనీయం ఇప్పుడు. ! అది ఒక మధురమైన బంధం - సంబంధం !

- ఆంధ్రప్రభ 24.8.2004 - 2.9.2004